# అల్పాభివృద్ధి దేశాలు.. లక్షణాలు


డా.తమ్మా కోటిరెడ్డి
ప్రొఫెసర్, ఐబీఎస్

**'అల్ప తలసరి జాతీయోత్పత్తి'... ఆర్థికవేత్తల అభిప్రాయంలో ఒక దేశ ఆర్థిక వెనుకబాటుకు ముఖ్య కారణమిది. సాధారణంగా దేశ ఆర్థికాభివృద్ధి గణనలో జనాభా వృత్తుల వారీ పంపిణీ, జాతీయాదాయంలో వివిధ రంగాల వాటాల్లోని మార్పు సూచికలే ప్రధాన సాధనాలు. ఈ సూచికలే దేశాభివృద్ధిని గణించడానికి ఉపయోగపడతాయని భావించలేం. చాలా దేశాలు ఆర్థికాభివృద్ధి కోసం అనేక చర్యలు తీసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో... వెనుకబడిన దేశాలను అభివృద్ధి చెందుతున్న దేశాలుగా పరిగణించడం సమంజసం. అల్పాభివృద్ధి దేశాల్లో ఉత్పాదక పెట్టుబడులు పెంచి స్వయం సమృద్ధిని సాధించవచ్చు.**

కేవలం వనరుల లభ్యత ఆధారంగా వివిధ దేశాలను అభివృద్ధి చెందిన, అల్పాభివృద్ధి దేశాలుగా వర్గీకరించటం కష్టం. అన్ని దేశాల్లో సహజ, మానవ వనరులు ఒకే పరిమాణంలో లభ్యం కాకపోవడమే ఇందుకు కారణం. ప్రస్తుతం అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్, ఇటలీ, జపాన్, జర్మనీలు అధికాభివృద్ధి చెందిన దేశాలు. ఖనిజ వనరులు అధికంగా లభిస్తున్నప్పటికీ లాటిన్ అమెరికా, మధ్య తూర్పు (Middle East) దేశాలు అల్పాభివృద్ధి చెందిన దేశాలుగా మిగిలిపోయాయి. భారత్, బంగ్లాదేశ్, ఇండోనేషియా, పాకిస్థాన్, చైనాలలో జన సాంద్రత ఎక్కువ. ఈ దేశాల్లో ఆర్థిక వెనుకబాటుకు అధిక జనాభా వృద్ధే కారణమని ఆర్థిక వేత్తల అభిప్రాయం. ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో జనాభా తక్కువైనప్పటికీ మిగతా ఆసియా దేశాల మాదిరిగా వీటిలో అల్పాభివృద్ధి కన్పిస్తుంది.

జనాభా వృత్తుల వారీ పంపిణీ ఆధారంగా దేశాలను అభివృద్ధి చెందిన, అల్పాభివృద్ధి దేశాలుగా వర్గీకరించడం సాధ్యమవుతుంది. శ్రామికశక్తిలో ఎక్కువ శాతం మంది ఉపాధి కోసం ప్రాథమిక రంగం(వ్యవసాయం, అడవులు, పశుపోషణ)పై ఆధారపడితే ఆ దేశాన్ని వెనుకబడిన దేశంగా పేర్కొనవచ్చు. ఈ దేశాల్లో ఏర్పడిన పరిశ్రమల ప్రభావం అక్కడి ప్రజల సాంఘిక - ఆర్థిక జీవనంపై కనిపిస్తుంది. భారత్, నేపాల్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, చైనా, టాంజానియా దేశాలు ఈ కోవకే చెందుతాయి. మరోవైపు లెబనాన్, చిలీ, అర్జెంటీనా, ఉరుగ్వే, వెనిజులాలు వ్యవసాయక దేశాలు కావు. ఈ దేశాల్లో 20 శాతం కంటే తక్కువ శ్రామికశక్తి వ్యవసాయంరంగం మీద, 25 శాతాని కంటే ఎక్కువ శ్రామికశక్తి పారిశ్రామికరంగంపై ఆధారపడింది. కాని ఇవి కూడా వెనుకబడిన దేశాల వర్గీకరణలో చేరాయి. వెనుకబాటుతనం తీవ్రత వ్యవసాయక దేశాలు, పారిశ్రామిక దేశాల్లో వేరుగా ఉన్నప్పటికీ 'వృత్తులవారీ పంపిణీ' అనే సూచిక దేశాల మధ్య వర్గీకరణకు ఉపకరించదు. జనాభా వృత్తుల వారీ పంపిణీ, జాతీయాదాయంలో వివిధ రంగాల వాటా.. అనే సూచికలు ఆర్థిక ప్రగతికి కొలమానాలైనా ఒక దేశ అభివృద్ధి స్థాయిని గణించడానికివి కచ్చితంగా ఉపకరిస్తాయని చెప్పలేం .

## అల్పాభివృద్ధి-ఆర్థికవేత్తల అభిప్రాయాలు:

అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, పశ్చిమ ఐరోపా దేశాల తలసరి నిజఆదాయంతో పోల్చినపుడు.. వాటికంటే తక్కువ తలసరి నిజ ఆదాయం ఉన్న దేశాలను అల్పాభివృద్ధి దేశాలుగా పరిగణించవచ్చని ఐక్యరాజ్యసమితి నిపుణుల అభిప్రాయం. జాన్ రాబిన్‌సన్ అభిప్రాయంలో ''అనేక అరబ్ దేశాల తలసరి స్థూల జాతీయోత్పత్తి ధనిక పశ్చిమ దేశాల కంటే వేగంగా పెరిగినా.. వీటిలో కొన్ని దేశాలు ఇప్పటికీ ప్రపంచంలో పేద, అల్పాభివృద్ధి దేశాలుగా మిగిలాయి. తలసరి జాతీయోత్పత్తి లేదా సగటు జీవన ప్రమాణం అనే సూచికలు అన్ని సమయాల్లో అభివృద్ధిని కొలవడానికి ముఖ్య సూచికలుగా ఉపయోగపడవు''. అభివృద్ధి సామర్థ్యం (Development potential) అల్పాభివృద్ధి తీవ్రతను కొలవడానికి ఒక సూచికగా ఉపయోగపడుతుందని జాకబ్ వైనర్ అభిప్రాయపడ్డారు. మానవ వనరులు, సహజ వనరులను అభిలషణీయ స్థాయిలో వినియోగించుకోలేని దేశాన్ని అల్పాభివృద్ధి దేశంగా ప్రణాళికా సంఘం నిర్వచించింది. ఆధునిక ఆర్థిక వేత్తల అభిప్రాయంలో అభివృద్ధికి సూచికలు పేదరిక నిర్మూలన, ఆదాయ అసమానతల తగ్గింపు, నిరుద్యోగం రూపుమాపడం. ''అల్పాభివృవృద్ధి దేశాలు పేదరిక విష వలయంలో చిక్కుకున్నా యి, ఆ దేశాల్లో పొదుపు చేసే సామర్థ్యం కూడా తక్కువ'' రగ్నర్ నర్క్స్ (Ragnar Nurkse) అభిప్రాయంకాగా.. అల్పాభివద్ధి దేశాల్లో ఆదాయ అసమానతలు ఎక్కువని కుజ్‌నట్ అభిప్రాయపడ్డారు. అల్పాభివృద్ధి దేశాల లక్షణాలు ప్రధానంగా ఆరు.. అవి..

## తక్కువ తలసరి స్థూల దేశీయోత్పత్తి, అధిక పేదరికం:

అభివృద్ధి చెందిన, అల్పాభివృద్ధి దేశాల మధ్య ఆదాయ అసమానతలు ఎక్కువగా ఉండటమే కాక.. అవి క్రమంగా పెరుగుతున్నాయి. ప్రపంచ బ్యాంకు వర్గీకరణ ప్రకారం.. 2006లో 11,116 డాలర్లు, అంతకంటే ఎక్కువ తలసరి ఆదాయమున్న దేశాలు అధిక ఆదాయ దేశాలు. కాగా 906 నుంచి 11,115 డాలర్ల లోపు తలసరి ఆదాయం ఉన్న దేశాలు మధ్య ఆదాయ దేశాలు, 905 డాలర్లు లేదా అంతకంటే తక్కువ తలసరి ఆదాయమున్న దేశాలు అల్పాదాయ దేశాలు. దేశాల మధ్య సగటు ఆదాయాన్ని పోల్చడానికి 'కొనుగోలు శక్తి సామ్యం' ఆధారంగా లెక్కించిన తలసరి ఆదాయం ఒక ముఖ్య సూచిక. 2006లో తలసరి స్థూల దేశీయోత్పత్తి నార్వేలో 51,862 డాలర్లు, అమెరికాలో 43,968 డాలర్లు, యూకేలో 32,654 డాలర్లు కాగా భారత్‌లో 2,489 డాలర్లు మాత్రమే. అధిక పేదరికం అల్పా భివృద్ధికి ఒక ముఖ్య కారణం. కాంగో, మడగాస్కర్‌లో 2002– 07 మధ్య 71.3 శాతం మంది, స్వాజిలాండ్‌లో 69.2 శాతం మంది, నైజర్‌లో 63 శాతం మంది ప్రజలు పేదరికంలో ఉండగా.. ఇదే సమయంలో చైనా లో 2.8 శాతం, భారత్‌లో 28.6 శాతం మంది పేదరికంలో ఉన్నట్లు అంచనా.

## మూలధన కొరత:

పేదరిక తీవ్రత ఎక్కువై.. అనేక అల్పాదాయ దేశాల్లో మూలధన కల్పన రేటు తక్కువగా ఉంది. నిరపేక్ష

ఆదాయం ఎక్కువైతే పొదుపు సామర్థ్యం కూడా ఎక్కువ అవుతుంది. అభివృద్ధి చెందిన దేశం జపాన్‌లో మూలధన కల్పన రేటు ఎక్కువగా ఉండటాన్ని ఇది సూచిస్తుంది. వేగంగా వృద్ధి చెందుతున్న ఆసియా దేశాలు.. రిపబ్లిక్ ఆఫ్ కొరియా, థాయ్‌లాండ్, మలేషియా, సింగపూర్, హాంగ్‌కాంగ్‌ల జీడీపీలో పొదుపు రేటు పెరగడంతో అధిక పెట్టు బడులు సాధ్యమై ఆర్థికాభివృద్ధి చోటు చేసుకుంది. ప్రస్తుతం తమ జీడీపీలో 15 శాతం కంటే తక్కువ పొదుపు రేటు ఉన్న దేశాల సంఖ్య చాలా తక్కువ. అల్పాభివృద్ధి దేశాల్లో మార్కెట్ పరిమాణం తక్కువగా ఉండటం, ప్రజలు తమ పొదుపును అనుత్పాదక వినియోగంపై ఎక్కువ వ్యయం చేస్తుండడంతో ఉత్పాదక పెట్టుబడులు తగ్గుతున్నాయి.

## అధిక జనాభా వృద్ధి, అనుత్పాదక వినియోగదారులు:

అనేక దశాబ్దాలుగా అల్పాభివృద్ధి దేశాల్లో జనాభా వృద్ధి రేటు 2 శాతం, అంతకంటే ఎక్కువగా ఉంది. అభివృద్ధిలో భాగంగా ఆరోగ్య సౌకర్యాలు విస్తృతమై మరణాల రేటు తగ్గి జనాభా విపరీతంగా పెరిగింది. గత ఐదు దశాబ్దాలుగా ఆఫ్రికా, దక్షిణ ఆసియా, లాటిన్ అమెరికాల్లో జనాభావృద్ధి అధికంగా ఉండటమే కాక ప్రజల జీవన ప్రమాణం తగ్గింది. కొన్ని వ్యవసాయక దేశాల్లో ఇటీవల కాలంలో అధిక జనాభా వృద్ధి వల్ల జీవన ప్రమాణాలు తగ్గాయి. పారిశ్రామికంగా ఈ దేశాలు వెనుకబడటం వల్ల పెరుగుతున్న జనాభా జీవనోపాధి కోసం వ్యవసాయ రంగంపై ఆధారపడింది. దీంతో నిరుద్యోగం పెరిగి అనుత్పాదక వినియోగదారుల సంఖ్య పెరిగింది. ఏ దేశమైనా జనాభా వార్షిక వృద్ధి 2 శాతం ఉన్నప్పుడు తలసరి స్థూల జాతీయోత్పత్తి వృద్ధి కూడా 2 శాతం ఉండాలి. మూలధన ఉత్పత్తి నిష్పత్తి 4:1గా ఊహించినపుడు.. తలసరి స్థూల జాతీయోత్పత్తిలో వార్షిక వృద్ధి 2 శాతం ఉండాలంటే పెట్టుబడి రేటు 8 శాతం ఉండాలి. అదేవిధంగా.. ఏ దేశమైనా తలసరి స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటును 8 శాతం లక్ష్యంగా నిర్ణయిస్తే.. పెట్టుబడి రేటు జీఎన్‌పీలో 32 శాతం ఉండాలి.

## అధిక ఆదాయ అసమానతలు:

అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చితే అల్పాభివృద్ధి దేశాల్లో ఆదాయ అసమానతలు ఎక్కువ. ఒక దేశ జాతీయాదాయంలో జనాభాలో 60 శాతం ఉన్న పేదల వాటాను.. 20 శాతం ఉన్న ధనిక జనాభా వాటాతో పోల్చినపుడు.. కెన్యా, నైజీరియా, జాంబియా, కొలంబియా, మలేషియా, బ్రెజిల్, మెక్సికో, వెనిజులా, థాయ్‌లాండ్, అర్జెంటీనాలో ఆదాయ అసమానతలు ఎక్కువ. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ఫిన్‌లాండ్, ఆస్ట్రేలియా, నెద ర్లాండ్స్, స్వీడన్, జర్మనీ, ఫ్రాన్స్, జపాన్‌లలో ఆదాయ అస మానతలు తక్కువ.

## వ్యవసాయ రంగంపై ఎక్కువగా ఆధారపడటం:

లెబన్‌స్టీన్ అభిప్రాయంలో ‘‘వ్యవసాయరంగంపై ఎక్కువగా ఆధారపడటం అల్పాభివృద్ధి దేశాల

లక్షణం''. ఈ దేశాల్లో 70– 90 శాతం మంది వ్యవసాయరంగంపై ఆధారపడతారు. లభ్యమయ్యే శ్రామిక శక్తి ఎక్కువగా వ్యవసాయ రంగంపై ఆధారపడటమే గాక ఆ దేశాల జాతీయాదాయంలో సింహభాగం ఈ రంగం నుంచే వస్తుంది. మేలురకం వంగడాలు, రసాయన ఎరువుల వినియోగం ఈ దేశాల్లో తక్కువ. జనాభా వృద్ధి రేటు ఎక్కు వవడం.. అందుబాటులోని భూ పరిమాణం తగ్గుతుండడం.. కారణాలుగా వ్యవసాయరంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవడానికి వీలవదు. పర్యవసానంగా ఉత్పత్తి, ఉత్పాదకత తగ్గుతుంది.

## మానవ వనరుల నాణ్యత లోపించడం:

అల్పాభివృద్ధి దేశాల్లో మానవాభివృద్ధి లోపించడానికి ప్రధాన కారణాలు విద్య, ఆరోగ్య ప్రమాణాలు తక్కువగా ఉండటం. ఈ సూచికల విషయంలో అభివృద్ధి చెందిన దేశాల కంటే అల్పాభివృద్ధి దేశాలు ఎంతో వెనుకబడి ఉన్నాయి. 2006లో స్థూల ఉమ్మడి నమోదు నిష్పత్తి అమెరికాలో 92.4 శాతం, నార్వేలో 98.6 శాతం, యూకేలో 89.2 శాతం.. కాగా భారత్‌లో 61 శాతం, నైజీరియాలో 52.5 శాతం, నైజర్‌లో 26.2 శాతం మాత్రమే. 2006లో రూపొందించిన అంచనాల ప్రకారం ఆయా దేశాల్లో సగటు జీవన ప్రమాణాలు ఇలా ఉన్నాయి.. జపాన్‌లో 82.4 సంవత్సరాలు, అమెరికాలో 78 సంవత్సరాలు, యూకేలో 79.2 సంవత్సరాలు. అది భారత్‌లో 64.1 సంవత్సరాలు, నైజీరియాలో 46.6 సంవత్సరాలు, సియారాలియాన్‌లో 42.1 సంవత్సరాలు మాత్రమే. 15 ఏళ్లు అంతకు పైబడిన వయోజను ల్లో అక్షరాస్యత... అభివృద్ధి చెందిన దేశాల్లో సుమారు 100 శాతానికి దగ్గరగా ఉంటే భారత్‌లో 65.2 శాతం, నైజీరియాలో 71 శాతం, నైజర్‌లో 29.8 శాతం!!

### సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | ఎ | 2 | బి | 3 | సి | 4 | డి | 5 | సి |
| 6 | బి | 7 | ఎ | 8 | బి | 9 | డి | 10 | డి |
| 11 | బి | 12 | ఎ | 13 | సి | 14 | బి | 15 | సి |
| 16 | డి | 17 | సి | 18 | ఎ | 19 | సి | 20 | ఎ |
| 21 | ఎ | 22 | బి | 23 | ఎ | 24 | బి | 25 | ఎ |
| 26 | డి | 27 | బి | 28 | సి | 29 | డి | 30 | బి |
| 31 | ఎ | 32 | సి | 33 | డి | 34 | సి | 35 | ఎ |
| 36 | డి | 37 | సి | 38 | డి | 39 | బి | 40 | సి |
| 41 | బి | 42 | డి | 43 | ఎ | 44 | డి | 45 | ఎ |
| 46 | బి | 47 | సి | 48 | సి | 49 | డి | 50 | బి |
| 51 | ఎ | 52 | సి | 53 | సి | 54 | డి | 55 | సి |
| 56 | బి | 57 | డి | 58 | సి | 59 | ఎ | 60 | సి |

SAKSHI

SAKSHI